




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 30-7-2025

సంపుటి: 21 సంచిక: 109

పేజీలు: 8 వెల: రూ.1


## ‘తొలి అడుగు’ తడబడి..

# ‘మోసం’ మొక్కుబడి

- తొలి ఏడాది కార్యక్రమాల్లో విఫలమవుతున్న టీడీపీ, వైకాపా
- పిలిస్తే వెళ్లడం తప్ప.. పర్యవేక్షణ పట్టని వైకాపా ఇన్‌ఛార్జీలు
- వేసిన కరప్రాతాలు కూడా టీడీపీవన్న తప్పుడు సంకేతాలు
- ఇంటింటికీ చేరని అధికార పార్టీ కార్యక్రమం
- తమ క్రెడిట్‌ను వేరొకరు కొట్టేస్తారనే కార్యకర్తల ఆందోళనే కారణం

**అధికార మార్పిడి జరిగి ఏడాది పూర్తి అయిన నేపథ్యంలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా చేపట్టిన ప్రజా చైతన్య కార్యక్రమాలను కిందిస్థాయి కార్యకర్తలు అంతంత మాత్రంగానే జనాల్లోకి తీసుకువెళ్తున్నారు. వైకాపా హయాంలో సామాన్య కార్యకర్తకు జగన్మోహన్‌రెడ్డి ఒరగబెట్టిందేమీ లేదన్న నిరాశతో ఆ పార్టీ నేతలు, కూటమిలో కార్యకర్తగా పనిచేసే కంటే ప్రతిపక్ష పార్టీకి మద్దతు తెలపడమే బెటరన్న కోణంలో తెలుగుదేశం కార్యకర్తలు ఉండటం వల్ల ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతుంటే.. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమం మందకొడిగా సాగుతోంది.**






**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పై రెండు కార్యక్రమాలు ఒకదానికొకటి కౌంటర్. జులై 4 నుంచి ఆగస్టు 4 వరకు ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహించాలని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పీఏసీ సభ్యులతో ఆ మధ్య సుదీర్ఘ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ఏం పేర్కొన్నారో.. వాటిలో ఎన్ని అమలయ్యాయో చెప్పి.. ఎంత మేరకు మోసం చేశారో వివరించడంతోపాటు పార్టీ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి ప్రజల స్పందనను నమోదు చేయాలని సూచించారు. ఎందుకంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసేశానని అన్యాపదేశంగా పేర్కొన్నారు. కానీ బాబు మోసం చేశారని జనానికి తెలియాలన్న కోణంలో జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోమన్నారు. ఇందుకోసం ముందు జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈమేరకు శ్రీకాకుళం జిల్లా స్థాయి సమావేశాన్ని స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా చూసుకుంటే ధర్మాన ప్రసాదరావు బంగ్లాలో జరిగిన సమావేశం కూడా విజయవంతమైంది. ధర్మాన క్రియాశీలంగా లేకపోయినా ఇది అనుకున్నదానికంటే ఎక్కువ విజయవంతమైంది. అంతే.. ఆ తర్వాత ఎక్కడికక్కడ ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ ఆగిపోయింది.

### పర్యవేక్షణ శూన్యం

ఈ కార్యక్రమం జరుగుతున్న తీరును పర్యవేక్షించే నాథుడే లేడు. అయితే ‘మోసం గ్యారెంటీ’ కార్యక్రమం అమల్లో జిల్లాలో టెక్కలి, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఇదే పెద్ద ఊరట అన్నట్టు జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ దన్నెట్టేశారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న తమ్మినేని సీతారాం ఏ నియోజకవర్గం నుంచి పిలుపుపొస్తే ఆ నియోజకవర్గానికి ముఖ్య అతిథిగా వెళ్లడం తప్ప తన సొంత నియోజకవర్గం ఆమదాలవలసలో గానీ, జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో గానీ క్యూఆర్ కోడ్ స్కాన్లు ఏమేరకు జరుగుతున్నాయని ఒక్కరోజు కూడా అడిగిన పాపాన పోలేదు. ఈ కార్యక్రమం కోసం పార్టీ పరిశీలకులు కురసాల కన్నబాబు, కుంభా రవిబాబు సైతం ఆరా తీసినట్లు కనపడలేదు. ప్రొఫెసర్‌గా పని చేసిన కుంభా రవిబాబు లెక్చర్లు ఇవ్వడానికి అలవాటు పడటం వల్ల ఏ కార్యక్రమానికి వచ్చినా సుదీర్ఘంగా ప్రసంగించి వెళ్లిపోతున్నారు తప్ప పరిశీలకుడిగా గ్రామస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవడంలేదు. అన్నింటికంటే విచిత్రమేమిటంటే.. టౌన్, మండల, గ్రామస్థాయిల్లో రొటీన్ కార్యక్రమం మాదిరిగా ఓ ఫ్లెక్సీ పట్టుకొని జంక్షన్‌లో నిల్చొని ఫొటోకు ఫోజిచ్చి వెళ్లిపోతున్నారు. కాగా 2024 ఎన్నికల్లో చంద్రబాబు మాట ఇచ్చి నేటికీ అమలుకాని హామీలు




అంటూ ప్రజాగళం పేరుతో వైకాపా ఒక పాంప్లెట్‌ను పంచుతోంది. విడ్డూరమేమిటంటే.. దీనిమీద చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు పెద్దవిగా ఉన్నాయి. అంతేకాకుండా ఉమ్మడి మేనిఫెస్టో 2024 అని రాసుంది. ఈ పాంప్లెట్‌లో కంటెంట్ ఏమిటనేది చూడని ప్రజలు కూటమి ప్రభుత్వానికి వైకాపా ప్రచారం చేస్తుందన్న భావనలో జోకులు వేసుకుంటున్నారు.

### ముందడుగు వేయని టీడీపీ కార్యకర్తలు

మరోవైపు ఏడాదిలోనే హామీలన్నీ అమలుచేశామని చెప్పుకోవడానికి.. సామాజిక భద్రత పింఛన్లు, అమ్మకు వందనం, ఉచిత గ్యాస్ సిలెండర్లు వంటివి అర్హులందరికీ వచ్చాయా లేదా అని తెలుసుకోవడానికి సుపరిపాలనలో తొలి అడుగు పేరిట తెలుగుదేశం రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమం కూడా గ్రామ, మండల స్థాయిల్లో అంతంత మాత్రంగానే నడుస్తోంది. ఒక పోలింగ్ బూత్ పరిధిలో 500 మంది ఓటర్లు ఉన్నారనుకుంటే అందులో 300కు మించి ఇళ్లు దొరకడంలేదు. వాటిలో కూడా లబ్ధిదారులు ఎంతమంది? పథకాలు దక్కనివారు ఎంతమంది? అనేది తెలుసుకొని, వారి సమస్యను పార్టీ రూపొందించిన మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇది ఎంతమంది చేశారన్నదానిపై ఆ పార్టీ ప్రధాన కార్యాలయం మాత్రం రెగ్యులర్‌గా మానిటర్ చేస్తోంది. కాకపోతే స్థానికంగా క్యాడర్‌లో మాత్రం చలనం ఉండటంలేదు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా తమకు ఆర్థికంగా ఎటువంటి లబ్ధి చేకూరలేదని, కిందిస్థాయి పదవులన్నీ జనసేనతో నింపేస్తుండటంతో తమకు

- మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# జనాభా వృద్ధిలో అసమానతలు

హిందువుల జనాభా నానాటికి తగ్గిపోతోందని హిందూ సంఘాలు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తుంటాయి. అయితే ఒక్క మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హిందూ జనాభా తగ్గుతోంది. అంతర్జాతీయ సర్వే సంస్థ ప్యూ రీసర్చ్ సెంటర్ కొన్ని సంచలన విషయాలు వెల్లడించింది. దక్షిణాసియాలో హిందూ జనాభా భారీగా తగ్గినట్లు గణాంకాలతో సహా వివరించింది. 2010–20 మధ్య భారత్, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లలో హిందూ జనాభా ఐదు శాతం మేరకు తగ్గిందని ఈ నివేదిక పేర్కొంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద మతంగా ఉన్న హిందూ మతానికి చెందినవారు 120 కోట్ల మంది ఉన్నట్లు తెలిపింది. అలాగే షేర్ ఆఫ్ రెలిజియస్ మైనారిటీస్ – ఎ క్రాస్ కంట్రీ అనాలిసిస్ (1950–2015) పేరిట విడుదలైన ఒక రిపోర్టులో మరికొన్ని కీలకాంశాలు వెల్లడయ్యాయి. 1950 నుంచి 2015 మధ్య కాలంలో భారతదేశంలో ముస్లిం జనాభా అత్యధికంగా పెరిగిందని.. దాని పెరుగుదల రేటు ఏకంగా 43 శాతం మేరకు ఉందని పేర్కొంది. అదే సమయంలో హిందూ జనాభా పెరుగుదల రేటు ఎనిమిది శాతం వరకు తగ్గిపోయింది. పీఈడబ్ల్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయన నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో మొదటి స్థానంలో క్రైస్తవులు ఉండగా రెండో స్థానంలో ముస్లింలు, మూడో స్థానంలో బౌద్ధ మతస్తులు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో హిందువులు ఉన్నారు. ప్రపంచ హిందువుల్లో దాదాపు 99 శాతం మంది ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. భారతదేశం, నేపాల్, మారిషస్‌లలో హిందువులు మెజారిటీ మత సమూహంగా ఉన్నారు. 2010–20 మధ్య మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా ప్రాంతాల్లో హిందూ జనాభా 62 శాతం (దాదాపు 32 లక్షలకు) పెరిగింది. ఇదే కాలంలో ఉత్తర అమెరికాలో హిందూ జనాభా 55 శాతం (36 లక్షలకు) పెరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూరప్ వంటి ప్రాంతాల్లో కూడా హిందూ జనాభా కాస్త పెరిగినా భారతదేశం, నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో కూడిన దక్షిణాసియా ప్రాంతంలో మాత్రం హిందూ జనాభా వృద్ధి రేటు ఐదు శాతం వరకు తగ్గింది. 15 నుంచి 19 ఏళ్ల వయస్సు గల ముస్లిం మహిళల్లో ఎనిమిది శాతం టీనేజ్ గర్భధారణలతో ఇతర మతాల్లో కంటే ఎక్కువగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. అలాగే మరో బిడ్డను కనాలనుకునే మహిళలు ముస్లిం మతంలోనే ఎక్కువ శాతం ఉన్నారు. 15 నుంచి 49 ఏళ్ల వయస్సున్న వివాహిత మహిళల్లో 72 శాతం మంది సిక్కులు, 71 శాతం మంది హిందువులు అదనపు పిల్లలను కనకూడదని భావిస్తుంటే.. ముస్లిం మతంలో ఇలా భావించే మహిళల సంఖ్య 64 శాతం మాత్రమే. భారతదేశంలోనే ఇదే పరిస్థితి నెలకొన్నట్లు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి నివేదిక పేర్కొంది. 1950–2015 మధ్య కాలంలో దేశంలో హిందూ జనాభా 7.8 శాతం తగ్గిపోయింది. అదే సమయంలో మైనారిటీ జనాభా పెరిగింది. ముస్లిం జనాభా ఏకంగా 43.15 శాతం, క్రిస్టియన్ జనాభా 5.38 శాతం, సిక్కు జనాభా 6.58 శాతం పెరిగినట్లు నమోదైంది. 1950లో దేశ జనాభాలో హిందువుల వాటా 84 శాతం. కానీ 2015 నాటికి ఇది 78 శాతానికి పడిపోయిందని నివేదిక వెల్లడించింది. మరోవైపు గత 65 ఏళ్లలో ముస్లిం జనాభా 9.84 శాతం నుంచి 14.09 శాతానికి పెరిగింది. మెజారిటీ జనాభా తగ్గుదలలో దేశాల పరిస్థితిని పరిశీలిస్తే మయన్మార్ తర్వాత భారత్ రెండోస్థానంలో ఉంది. మయన్మార్‌లో మెజారిటీ జనాభా పది శాతం తగ్గగా.. భారత్‌లో దాదాపు ఎనిమిది శాతం తగ్గుదల ఉంది. మూడో స్థానంలో ఉన్న నేపాల్‌లోనూ మెజారిటీ జనాభాగా ఉన్న హిందువుల్లో 3.6 శాతం తగ్గుదల నమోదైంది. భారతదేశంలో జనాభా వృద్ధి రేటులో ఇటువంటి అసాధారణ అసమానతలకు కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న కుటుంబ నియంత్రణ విధానాలు, కొన్ని మతాల్లోని మూఢ నమ్మకాలేనని భావిస్తున్నారు. మన దేశంలో హిందువులతో పోలిస్తే ముస్లింలలో అక్షరాస్యత తక్కువ, కట్టుబాట్లు చాలా ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తుంది. దాంతో జనాభా నియంత్రణ పద్ధతులను ఈ వర్గీయులు పెద్దగా పాటించడంలేదని ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. హిందువులు, క్రిస్టియన్లు, ఇతర వర్గాలవారు ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటే. ముస్లిం వర్గీయులు ఇప్పటికీ బహుళ సంతానం వైపే మొగ్గు చూపుతున్నారు. అధిక శాతం ముస్లింలు కు.ని. విధానాలను పాటించడానికి ఇష్టపడటంలేదు. ఓట్ల రాజకీయాల కారణంగా ప్రభుత్వాలు కూడా వారిని ఏమీ అనలేకపోతున్నాయి. ఇదే జనాభాలో అసమానతలకు దారితీస్తోంది.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర బుధవారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ ఆయన స్వగ్రామానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.
– సత్యంన్యూస్, శ్రీకాకుళం



వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆపార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం వంటి అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగింది.
– సత్యంన్యూస్, పాతపట్నం

# ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదు




(సత్యంన్యూస్, పలాస)

కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో దోపిడీకి పాల్పడితే సహించేది లేదని, అలా కాదని ముందుకెళ్తే ప్రజా ప్రతిఘటన తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కి వ్యతిరేకంగా బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ ఎయిర్ పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తూ ఒంకూరులో జరిగిన ర్యాలీ, అనంతరం కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో బలవంతంగా భూములు తీసుకోవడం వల్ల ఇక్కడ ప్రజలు నిరాశ్రయులు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అయిన ఢిల్లీ కార్గో ఎయిర్పోర్ట్‌కి 150 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. ఇక్కడ కార్గో ఎయిర్‌పోర్ట్‌కి 1400 ఎకరాలు ఎవరు ప్రయోజనాల కోసం కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ఢిల్లీ బెంగళూరు, తమిళనాడు, కర్ణాటక, విశాఖపట్నం మొదలగు రాష్ట్రాల్లో ఎయిర్‌పోర్ట్‌కి అనుబంధంగానే కార్గో ఎయిర్ పోర్ట్‌లు ఉన్నాయని, ఇక్కడ మాత్రం ఎందుకు ప్రత్యేకంగా కార్గో ఎయిర్‌పోర్ట్ కడుతున్నారని వారు ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజల భూములు లూటీ చేస్తారా అని ప్రశ్నించారు. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానం జీడిపంటని కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లు నరికియడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అదేవిధంగా జీడి ఆధార పరిశ్రమలు దెబ్బతిని వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే కార్పొరేట్ కంపెనీకి భూములు ఇవ్వడం ద్వారా కాదని, ఈ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా చివర భూములకు రెండు పంటలకు నీరు ఇవ్వడం ద్వారా ప్రజల ఆదాయం పెరిగి జిల్లా అభివృద్ధి అవుతుందన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దెల రామారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, పిఓడబ్ల్యూయు, జిల్లా కార్యదర్శి పి.కుసుమ, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, యన్.గణపతి, జోగి శ్రీదేవి, జె.సింహాచలం, యస్.లక్ష్మీనారాయణ, జి.బాలకృష్ణ, జోగి కొందండరావు, పోరాట కమిటీ నాయకులు, రామాపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, ధనంజయరావు, డి.రామారావు, యం.తులసిరావు, గుంటు రామస్వామి, లండ రామస్వామి, యం.సంతోష్, చిత్త గున్నయ్య, కోనేరు రమేష్ తదితరులతోపాటు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో నిర్ణయాన్ని

# వెనక్కు తీసుకోవాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయొద్దని, 3తరాలుగా డిపోలో పనిచేస్తున్న హమాలీల పొట్టలు కొట్టొద్దని కోరుతూ బుధవారం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల గ్రామంలో 100మంది దళిత కుటుంబాలకు చెందిన వారి నుంచి జాతీయ రహదారి ప్రక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే 4 ఎకరాలు భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాల వారికి కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారని, అప్పటి నుంచి ఇప్పుడు ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐయంఎల్ డిపోగా నడుస్తున్న దీనిలో 80 మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజు వారీ వచ్చే ఆదాయంపైనే 350 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపో ద్వారా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎచ్చెర్ల ఐయంఎల్ డిపోను విడదీసి టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేసి ఎచ్చెర్ల డిపోను యధావిధిగా కొనసాగించి దళితులు, పేదలుగా ఉన్న హమాలీల ఉపాధిని కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.




60/70లలో కెరీర్ ప్రారంభించిన ప్రతీ నటుడికి ఏదొక దశలో అప్పుడప్పుడూ గ్యాప్ వస్తూండేది. ఫ్లాపులు పడో లేక ట్రెండ్ మారో.. ఔట్ డేటెడ్ అయ్యో లేక ప్రేక్షకులకి బోర్ కొట్టేసో ఎక్కడొకచోట బ్రేక్ పడేది. కానీ చంద్రమోహన్ ఆ గ్యాప్పులకి, బ్రేకులకి అతీతుడు. వయోభారం వల్ల తనకి తాను తగ్గించుకుంటే తప్ప ఆఖరి వరకూ ఆయనకి అవకాశాలకి కొదవ లేదు..! మార్కెట్ మార్పులకు తగ్గట్టుగా ధోరణిని మలచుకుంటూ, వివాదాలకి అతీతంగా మెలగుతూ.. అలుపెరగకుండా యాభైఏళ్ళ పైబడి పరిగెత్తడమన్నది ఓ కళ. అది అందరికీ చేతకాదు. అందులో చంద్రమోహనుడు త్రివిక్రముడు..!!



70-80 దశకాల సినిమాలు విరివిగా వేసే యే ఈటీవీనో, లేక మరో ఛానెలో సరదాగా ఓసారి పెట్టండి. ఎక్కడో చోట చంద్రమోహన్ కనబడకపోడు. 70ల కాలంలో కొత్త హీరోయిన్లతో ఆడిపాడే లక్కీమస్కట్‌గా కనిపిస్తాడు.

80ల టైర్-1 బ్యాచ్ కృష్ణ-శోభన్‌లు ముందడుగు లాంటి మల్టీస్టారర్లు చేస్తే వాళ్ళ మధ్య ఓ క్యారెక్టర్ ఆర్టిస్టుగా దూరిపోయి మెరిపిస్తాడు.

మురళీమోహన్‌లాంటి టైర్-2 బ్యాచ్ చిన్నచిన్న మల్టీస్టారర్లు చేసుకుంటే అందులో రెండోహీరోగా భుజం కాస్తాడు. సీనియర్లతోనే కాబోలనుకుంటే, లేదూ లేత రాజేంద్రుడితో సైతం జతకట్టి బోలెడన్ని బడ్జెట్ సినిమాలతో నవ్విస్తాడు.

# చెయ్యని పాత్రా లేదు.. వెయ్యని వేషం లేదు..!!

90ల్లో ప్రేక్షకుల అభిరుచి మారినప్పుడు ఎంతో మంది పాతనటులు ఆ ఒరవడిని అందుకోలేక మమ్మల్నొదిలెయ్యండంటూ అక్కడే ఆగిపోయారు. కానీ చంద్రమోహన్ మాత్రం ట్రెండ్ కంటే ముందే పరిగెత్తి పరిశ్రమని కూడా అక్కడికి లాక్కెళ్లాడు. రాబోయే మార్పుల్ని త్వరగా పసిగట్టింది, భేషజాలకి పోకుండా అవకాశాల్ని ఒడిసిపట్టుకుంది ఈయనేనేమో..!!

అప్పటిదాకా హీరో తండ్రంటే సఫారీ సూటో లేదంటే పంచె కట్టో వేసుకుని, జుట్టుని ఇదాయకంగా తెల్లబరుచుకుని నాటకీయంగా కనబడే స్థితినుంచి కృష్ణవంశీ పుణ్యమాని తండ్రి పాత్రకి కొంచెం గ్లామరద్దాడు చంద్రమోహన్. టీషర్టూ, జీన్సులేసి కొడుకు తో కల్సి అల్లరి చేశాడు. పోట్లాడాడు. నవ్వించాడు. ఏడిపించాడు. సగం పైగా సినిమాల్లో కొడుకు భవిష్యత్తు మీద బెంగతోనే ఆందోళనగా కనబడేవాడు.

88లో త్రినేత్రుడుదాకా చిరంజీవికి మిత్రుడిగా వేసిన చంద్రమోహన్ అదే చిరంజీవికి ఇద్దరుమిత్రులులో తండ్రిగా మారిపోడానికి పదేళ్ళు కూడా పట్టలేదు.

2000 ప్రారంభంలో నలభైయేళ్ళ వెంకీకి, ఇరవైయేళ్ళ ఉదయ్ కిరణ్ కి ఇద్దరికీ చంద్రమోహనే తండ్రి.. నాటకీయతని, అతిని ప్రదర్శించే రోజుల్లో రంగప్రవేశం చేసినా సరే.. తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా నిజంగా ప్రవర్తిస్తున్నట్టు నటించటం ఈ సహజనటుని ప్రత్యేకత..!

బ్లాక్ & వైట్ కె. విశ్వనాథ్ మొదలుకుని బాపు, జంధ్యాల, నేటి ట్రెండ్ సెట్టర్లు త్రివిక్రమ్, శ్రీనువైట్ల దాకా అందరి దగ్గరా పాత్రల్ని సునాయాసంగా పోషించి రక్తి కట్టించిన నటులెవరన్నా ఉన్నారా..? ఒకేఒక్క చంద్రమోహనున్నాడు..!!

బాపు తీసిన రాధాకల్యాణంలో పాల్ఘాట్ మాధవన్ గా తమిళయాసని పట్టుకోవడం అంత సులభమేమీ కాదు. కానీ ప్రతిభాశాలి చంద్రమోహన్‌కి అదేమంత పెద్దపని కాలేదు. 7జీ బృందావన్ కాలనీలో కొడుకు ని పడేసి తన్నే తండ్రి పాత్రలో ఇంట్లో తండ్రులే కన బడ్డారు.

పదహారేళ్ళవయస్సులో అమాయకత్వంగా, కలికాలం, ఆమె చిత్రాలలో కరుణగా.. ఆడదేఆధారం, పెద్దరికంలో కామెడీగా.. పాపే నా ప్రాణంలో విలన్‌గా.. వేటికవే.. ఏ పాత్ర పండించినా ఫస్ట్ క్లాసే.. దాదాపు 900 పైగా సినిమాల్లో హీరో, సైడ్ హీరో, కమెడియన్, విలన్, సహాయనటుడు.. చెయ్యని పాత్రా, వెయ్యని వేషం లేదు. అలాంటి మరో నటుణ్ణి చూస్తామోలేదో కూడా తెలీదు.




# అందమైన చీర కట్టులో సోనాలి !!

**ఇండస్ట్రీకి ఎంతో మంది హీరోయిన్స్ వస్తుంటారు.. పోతుంటారు. కానీ కొద్ది మంది హీరోయిన్స్ మాత్రమే ఎప్పటికీ గుర్తుండి పోతారు. కొందరు హీరోయిన్స్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు మూడు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ ప్రేక్షకులను మెప్పిస్తూనే ఉంటారు. వారిలో సోనాలి బింద్రే ఒకరు అనడంలో సందేహం లేదు. ఈమె మధ్యలో సినిమాలను మానేసినా కూడా జనాలు ఈమెను మర్చిపోలేదు. ఈమె గురించిన వార్తలు ఎప్పుడూ వస్తూనే ఉన్నాయి.**

ముఖ్యంగా సోనాలి క్యాన్సర్‌తో పోరాటం చేసి గెలిచి నిలిచింది. దాంతో ఆమెను ఎంతోమంది ఆదర్శంగా తీసుకుని ఆరాధిస్తూ ఉంటారు, వయసు మీద పడ్డా కూడా క్యాన్సర్‌తో పోరాటం చేసి, తిరిగి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన అరుదైన స్టార్ అంటూ ఈమె గురించి ఆమె సన్నిహితులు, అభిమానులు చెబుతూ ఉంటారు. సోనాలి బింద్రే అందమైన ఫోటోషూట్ అందమైన సోనాలి బింద్రే ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. సాధారణంగా హీరోయిన్స్ సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేయడం కామన్‌గా చూస్తూ ఉంటాం. యంగ్ హీరోయిన్స్ స్కిన్ షో చేస్తే, నడుము అందం చూపిస్తే ఖచ్చితంగా వైరల్ అవుతాయి. యంగ్ హీరోయిన్స్ చీరకట్టి నడుము అందం చూపించి, నాభి అందాలను చూపిస్తే నెటిజన్స్ ఆ ఫోటోలను తెగ వైరల్ చేయడం మనం చూస్తూ ఉంటాం. సీనియర్ హీరోయిన్స్ అలా స్కిన్ షో చేస్తే ఎబెట్టుగా ఉంటుంది. అలా చూపించినా కూడా చూసేందుకు ఆసక్తి చూపించరు. వారి వయసు తగ్గట్లుగా, వారి అందాన్ని చూపించినప్పుడు మాత్రమే ఆ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. సోనాలి బింద్రే ఆ విషయంలో చాలా జాగ్రత్తగా ఉన్నట్టు అనిపిస్తూ ఉంటారు. 50 ఏళ్ల సోనాలి బింద్రే రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తారు, ఎప్పటికప్పుడు ఆ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి సోనాలి బింద్రే తన చీర కట్టు ఫోటోలతో సర్ ప్రైజ్ చేసింది. పింక్ చీర కట్టులో సోనాలి అందమైన ఫోటోలను షేర్ చేశారు. 50 ఏళ్ల వయసులోనూ సోనాలి చాలా అందంగా ఉన్నారు అంటూ అభిమానులతో పాటు అంతా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ సీనియర్ హీరోలకు జోడీగా హీరోయిన్‌గా నటించేంత అందం సోనాలి సొంతం అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...








# ఓ ఫోటోగ్రాఫర్ సక్సెస్ వెనుక ఓ పులిపిల్ల!!

**ఏ అంశంపైనైనా ప్రేమలో పడ్డారో.. అది ఏ పనైనా చేయిస్తుంది. యూఎస్‌లో మంచి జీతాన్ని వదులుకుని చెట్టూ, పుట్టా, గుట్టా అంటూ వన్యప్రాణుల ఫోటోల కోసం ఇండియాకు తిరిగివచ్చిన ఫోటోగ్రాఫర్ సుయాష్ కేసరీది అదే తరహా. 19 ఏళ్లకే తానంతగా ఇష్టపడి ప్యాషన్ పెంచుకున్న ఫోటోగ్రఫీలో నేచర్స్ బెస్ట్ ఫోటోగ్రఫీ ఆసియా అవార్డునందుకుని.. దాన్నేకంగా వాషింగ్టన్ డీసీలోని స్మిత్సోనియన్ నేచురల్ హిస్టరీ మ్యూజియంలోనూ ప్రదర్శించే స్థాయికెదిగిన ఆ ఛాయాచిత్రకారుడి కథకు ఓ ఆడ పులిపిల్ల స్ఫూర్తంటే మీరు నమ్మగలరా?**






మధ్యప్రదేశ్‌కు చెందిన సుయాష్ కేసరికి ప్రకృతన్నా, వన్యప్రాణులన్నా ఎనలేని ప్రేమ. బాంధవ్‌ఘర్ నేషనల్ రిజర్వ్ పార్క్‌లో సోలో పేరుతో ఉన్న ఓ ఆడ పులి అసహజ మరణం సుయాష్‌ను కలిచివేసింది. అప్పటికే ఓ టీవీ ఛానెల్‌లో ప్రెజెంటర్‌గా, వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సుయాష్.. ఆ ఆడపులి మరణంతో కొంతకాలం తన వృత్తికి కూడా విరామమిచ్చాడు. ఎందుకంటే ఆ పులితో సుయాష్‌కు ఏర్పడిన అనుబంధమే అందుకు ప్రధాన కారణం. బాంధవ్‌గఢ్‌లో ఆ పులి పిల్ల జన్మించిన నాటినుంచీ.. పెరిగి పెద్దదై మిగిలిన పులులతో ఫైటింగ్ చేసే వరకూ వివిధ రకాల సోలో టైగ్రెస్ ఫోటోలను తన కెమెరాలో బంధించిన అనుభవంతో పాటు.. ఆ క్రమంలో ఏర్పడిన అనుబంధమే.. సుయాష్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది.

'సోలో నీది నా జీవితంలో చాలా కీలకపాత్ర. నేను నీతో ఎన్ని లెక్కలేని గంటలు గడిపానో నాకే గుర్తులేదు. ముందు నిన్ను నా కెమెరాలో బంధించడానికి నీ గురించి తెలుసుకునే యత్నం చేశా. ఆ తర్వాత నీ నుంచే నేను చాలా నేర్చుకున్నా. ప్రేమ, ఆప్యాయత, కుటుంబం, ధైర్యం వంటి ఎన్నో లక్షణాలను నేను నీ నుంచి తెలుసుకున్నా' అంటూ తన సోషల్ మీడియా టైమ్ లైన్స్‌పై కూడా పోస్టింగ్స్ చేశాడు ఆమధ్య సుయాష్.

ఎందుకు సోలో అంటే సుయాష్‌కు ప్రత్యేక ప్రేమ అంటే..? తన 25 ఏళ్ల ఫోటోగ్రఫీ జీవితంలో సోలోదే ఎంతో కీలకపాత్ర. 'సఫారీ విత్ సుయాష్' పేరుతో సుయాష్ రూపొందించిన ఐదు భాగాల సిరీస్‌లో సోలోనే లీడ్ రోల్. ఆ సిరీస్ తన సోషల్ మీడియా సైట్స్ ద్వారా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) దృష్టిలో పడింది. ఆ తర్వాత ఆ సిరీస్ కొనసాగింపుకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌యే ఫండ్స్ కేటాయించగా.. వన్యప్రాణి పరిరక్షణ ఎంత అవసరమో జనం కళ్లు తెరిపించేలా ఆ సిరీస్ తన థర్డ్ ఐతో రూపొందించాడు సుయాష్. అదే సుయాష్‌కు తర్వాతి రోజుల్లో యానిమల్ ప్లానెట్ ఛానెల్‌లో అతి పిన్నవయస్సులో ప్రెజెంటర్ అవకాశాన్ని కూడా తెచ్చిపెట్టింది. అంతేకాదు మొదట చెప్పుకున్నట్టుగా 19 ఏళ్ల వయస్సులో ఆ ఆడపులి పిల్లను తీసిన ఫోటోలకే సుయాష్‌కు నేచర్స్ బెస్ట్ ఫోటోగ్రఫీ ఆసియా అవార్డును తెచ్చిపెట్టింది. ఆ ఫోటోనే ఫోటోగ్రాఫర్స్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే వాషింగ్టన్ డీసీలోని స్మిత్సోనియన్ నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ఒక సంవత్సరం పాటు ప్రదర్శించబడింది.




**'వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై తనలో అవగాహన పెంచింది జూ అంటాడు సుయాష్'**

చాలామంది పిల్లలు టామ్ & జెర్రీ వంటి కార్టూన్‌లను చూడటానికి, నేటి పిల్లలైతే మొబైల్ గేమ్స్ ఆడటానికో ఇష్టపడతారు. కానీ సుయాష్ మాత్రం తన బాల్యమంతా డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి ఛానెల్స్‌లో జంతువులు, పర్యావరణ వ్యవస్థ వంటివాటినే చూసుకుంటూ పెరిగాడు. దాంతోపాటే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో నివసించిన సమయాల్లో ఎక్కువగా జాతీయ పార్కులు, జంతు ప్రదర్శనశాలలను సందర్శించడంతో సుయాష్‌కు జంతువుల పట్ల వల్లమాలిన ప్రేమ ఏర్పడింది. కోల్‌కతాలోనూ తన తల్లిదండ్రులతో వేసవి సెలవుల్లో గడిపేందుకు వెళ్లినప్పుడు కూడా.. అలీపూర్‌లోని జూపార్కుకు తరచూ వెళుండేవాడు. అలా జూలలో పులులను బోనుల్లో చూసి చప్పట్లు కొట్టే సందర్భంలో అవి తిరిగి చూస్తున్నప్పుడు.. సుయాష్ తాత వాటి సహజ నివాసాలు అడవులని చెప్పిన మాటలు సుయాష్ ఆరేడేళ్ల వయస్సులోనే ఆయన మనస్సులో నాటుకున్నాయి. పంజరాలు జైళ్లవంటివన్న ఆలోచనతో ఆయనలో వన్యప్రాణుల పట్ల దృక్పథం మారిపోయింది. కొన్ని సంవత్సరాల తర్వాత సుయాష్ తన తండ్రి కెమెరాను ఉపయోగించి జంతువుల చిత్రాలను క్లిక్ చేయడం ప్రారంభించాడు. బేర్ గ్రిల్స్, నిగెల్ మార్వెన్, క్రిస్ ప్యాక్‌హామ్ వంటి ఫోటో ప్రెజెంటర్స్‌ను ఫాలో అవుతూ మెల్లిమెల్లిగా ప్రేరణ పొందేవాడు. భారత్ అడవుల్లోని వన్యప్రాణులను విదేశీ ఫోటోగ్రాఫర్స్ వచ్చి అందంగా బంధించి ప్రపంచానికి చూపెడుతున్నప్పుడు.. మనం భారతీయులం మాత్రం ఆ పని ఎందుకు చేయకూడదన్న కసి సుయాష్‌లో మరింత పెరిగింది.

**'ఆదిలో అంత ప్రోత్సాహమూ దక్కకపోగా నిరాశే ఎదురైంది.'**

17 సంవత్సరాల వయస్సులో సుయాష్ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ వృత్తినెంచుకుని.. అడవుల్లో అన్వేషణకు బయల్దేరాడు. కానీ వన్యప్రాణి సంరక్షకులు, అటవీశాఖ అధికారులు, ఇతర అధికారుల నుంచి కెరీర్ మొదట్లో ఏమాత్రం ప్రోత్సాహం లభించకపోగా.. ఈ ఫీల్డ్ శుద్ధ దండగనీ ముఖం మీదే చెప్పేశారు. ఎలాంటి డబ్బులాశించకుండా, మీరిచ్చే సర్టిఫికెట్స్ వంటివి కూడా అవసరం లేకుండా మీరేది చెబితే అది చేస్తూ.. ఇంటర్న్ షిప్ చేస్తానని చెప్పినా అధికారులు ససేమిరా అనడంతో.. సుయాష్ రూట్ మారింది. అలా తన అభిరుచిని విడిచిపెట్టి.. పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్‌ని అభ్యసించడానికి యూఎస్ బాట పట్టాడు సుయాష్. తను ఒక మంచి స్థిరమైన ఉద్యోగంలో సెటిలై కాస్తోకూస్తో సంపాదించుకున్న తర్వాత తాననుకున్న ఫీల్డ్‌లో మళ్లీ ప్రయత్నం మొదలెట్టాలన్న ఆశను మాత్రం సుయాష్ వదులుకోలేదు.

**'అసలు సుయాష్ ఎలా వెలుగులోకొచ్చాడు..?'**

చాలామందిలాగే.. సుయాష్ కూడా సోషల్ మీడియా స్యావీ. తన విద్యాభ్యాస కాలం నుంచే తను క్లిక్ చేసిన ఫోటోలను శీర్షికలతో సహా పోస్ట్ పెడుతూ మన్ననలందుకునేవాడు సుయాష్. యువత చిన్నగా, ఫన్నీగా ఉండే క్యాప్షన్‌తో కూడినవాటిని ఎక్కువ ఇష్టపడటాన్ని గమనించిన సుయాష్.. తన ఫోటోలకూ అలాంటి శీర్షికలే పెట్టడం వల్లే నెటిజనం స్పందననందుకున్నట్టు చెబుతాడు. అలా తన క్లిక్కులకు లైకులు, కామెంట్స్, షేర్స్ రూపంలో వస్తున్న స్పందనలతో.. మెల్లిగా సఫారీ విత్ సుయాష్ సీరీస్ తయారుచేయాలనే కోరికకు అంకురార్పణ జరిగింది. మధ్యప్రదేశ్ స్థానికుడైన సుయాష్‌కు చిన్ననాటి నుంచే పరిచయమున్నను బాంధవ్‌గర్ నేషనల్ రిజర్వ్ పార్కునే తన సిరీస్ నిర్మాణం కోసం కేంద్రంగా ఎంచుకున్నాడు. కొందరు స్పాన్సర్స్, రచయితలతో కలిసి అక్టోబర్ 2018లో సిరీస్‌ని చిత్రీకరించాడు. ఏదో కనిపించిన జంతువునల్లా ఫోటోలు కొట్టుకుంటూ వెళ్లడం కాకుండా.. ఓ క్రమపద్ధతిలో అద్భుతమైన స్టోరీ నేరేషన్‌తో ఉండేలా అటవీశాఖ నిపుణులు, కొందరు కథా రచయితల సహకారాన్నీ తీసుకున్నాడు. అంతేకాదు ఆ క్రమంలో పలు పుస్తకాలు చదవటం, యూట్యూబ్ వైల్డ్ లైఫ్ ఛానల్స్‌ను వాచ్ చేయడం వంటివి చేస్తూ.. మొత్తంగా ఓ అద్భుతమైన వైల్డ్ లైఫ్ దృశ్యకావ్యాన్ని సిరీస్ రూపంలో తీసుకొచ్చాడు సుయాష్.

**డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌ను ఆకట్టుకోవడంతో మారిన దశ**

సుయాష్ సోషల్ మీడియా కంటెంట్‌ని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) చూసింది. తను తన పోస్టులను ట్యాగ్ చేస్తుండటం వల్ల వారి దృష్టిలో పడటంతో పాటు.. వారికి సుయాష్ ఫోటోగ్రాఫ్స్‌లో సుమారు 200 ఫోటోలు బాగా నచ్చాయి. దాంతో వారు రంగంలోకి దిగి సుయాష్‌ను సంప్రదించారు. వారికి సుయాష్ సీరీస్ కాన్సెప్ట్ నచ్చడంతో స్పాన్సర్ షిప్ అందించడానికీ ముందుకొచ్చారు. అయితే సుయాష్ ధారావాహికంలో తానెంతగానో ఆరాధించిన సోలో అనే ఆడపులి కథనే ప్రధాన ఘట్టమైంది. వేట.. మానవులకు, జంతులకు మధ్య నెలకొన్న సంఘర్షణ, అటవీ నిర్మూలన, ప్రభుత్వ నష్టపరిహారం వంటి అనేక రకాల అంశాలను స్పృశించేలా సఫారీ విత్ సుయాష్ సీరిస్ క్లిక్కైంది. అలా సీరీస్‌లో ఐదు భాగాలను తీసుకురాగా.. దక్షిణాఫ్రికాలో సింహాలు, ఖడ్గమృగాలు, ఇతర అటవీ జంతువుల ఆధారంగా.. రెండో సిరీస్‌ను రూపొందించారు. సుయాష్ ఫోటోగ్రఫీపై ఏర్పర్చుకున్న అభిరుచితో ఇప్పటికే 23 దేశాలకు పైగా తిరిగాడు. కేవలం వంద నుంచి 200 మీటర్ల దూరం నుంచి వన్యప్రాణులను కెమెరాలో బంధించగల్గే నేర్పరితనం ఇప్పుడు సుయాష్ సొంతం. తన వాహనాన్ని ఎప్పుడు కూడా వాటి పొలిమేరల్లోకి తీసుకెళ్లకుండా వాటిని గౌరవిస్తూ జాగ్రత్తపడటంతో పాటు.. అవి దగ్గర్లోకొచ్చేవరకూ కూడా క్లిక్కుల కోసం నిరీక్షిస్తానంటాడు సుయాష్. అంతేకాదు తనకు అడవుల్లో సహకరించేవారందరికీ ఏదో ఓ రకమైన సాయమందిస్తుంటాడు. అటవీశాఖ అధికారులకు బూట్లివ్వడం, అటవీప్రాంతంలోని గిరిజనుల కోసం సోలార్ ల్యాంప్స్‌ను అందించడం, అక్కడి పిల్లల విద్యకు తగిన ప్రోత్సాహాన్నిందించడం వంటివెన్నో చేస్తూనే.. తనకిష్టమైన వృత్తిలో రాణిస్తున్నాడు సుయాష్. 2018లో.. 18 అడవి ఏనుగులు ఛత్తీస్‌గఢ్ నుంచి బాంధవ్‌గఢ్‌కు సురక్షితమైన నివాసం కోసం వలస వచ్చినప్పుడు.. అవి రైతుల పంటలను నాశనం చేశాయి. గ్రామస్థులు వాటిని భయపెట్టడానికి పటాకులు ఉపయోగించగా అవి ఎదురుతిరగడం తీవ్ర ఆందోళన రేపింది. ఆ సమయంలో సుయాష్, అతని బృందం జోక్యం చేసుకుని పొలాలను రక్షించడానికి.. కాక్టస్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయగా.. ఇప్పుడు బాంధవ్ గఢ్ రిజర్వ్ ఫారెస్ట్‌లో దాదాపు 50 ఏనుగులున్నాయి.

వన్యప్రాణి ప్రేమికుల కోసమే.. త్వరలోనే తన సొంత ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ను కూడా ప్రారంభించాలని ఆశిస్తున్నాడు సుయాష్. ఇదీ ఓ యంగ్ ఫోటోగ్రాఫర్‌కి తాను ప్రేమించిన వృత్తిపై తీరని దాహపు కథ! తనను క్లిక్కుమనిపించిన ఛాయాచిత్రకారుణి జీవితచిత్రాన్నే మార్చేసి, కంట తడిపెట్టించి వెళ్లిపోయిన ఓ పులికథ!!

- బాతాఖానీ సౌజన్యంతో..

## మంగువారితోటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

❖పారిశుధ్య నిర్వహణ తీరుపై ఆగ్రహం

❖బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని మంగువారితోట ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, తీరు, నిర్మాణాల్లో లోపాలపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఆయన మంగళవారం మధ్యాహ్నం మంగువారితోటకు హఠాత్తుగా వచ్చారు. ఆయన వస్తున్న సమాచారం మున్సిపల్ కమిషనర్‌కు సైతం తెలియకపోవడం విశేషం. అయితే కలెక్టర్ వచ్చిన సమాచారం అందుకున్న వెంటనే కమిషనర్ పీవీవీడీ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌తోపాటు టౌన్ ప్లానింగ్, ఇతర అధికారులు ఉరుకులు పరుగుల మీద అక్కడికి చేరుకున్నారు. ఈ పర్యటనలో రోడ్లు, కాలువలు పరిశుభ్రంగా లేని విషయాన్ని గమనించిన కలెక్టర్ పారిశుధ్య పనుల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్లు సక్రమంగా లేకపోవడం, ఆ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాల్లో లోపాలను గమనించిన కలెక్టర్ ఆయా పనులకు బాధ్యత వహించే సిబ్బందిపై మండిపడ్డారు. శానిటేషన్ సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని మందలించారు. బాధ్యులైన వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు.

## జూనియర్ కళాశాలలకు అడ్మిషన్లు పెరిగాయి

**- వృత్తి విద్యాశాఖాధికారి దుర్గారావు -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెరిగాయని వృత్తి విద్యాశాఖాధికారి (ఎఫ్ఏసీ) పి.దుర్గారావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం, విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్, నోట్‌బుక్స్, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ బుక్స్ కూడా ప్రభుత్వం అమలుచేసిందని, గత ఏడాది 2024-25 సంవత్సరంలో 6,046 మంది విద్యార్థులు జాయినవగా, 2025-26 సంవత్సరంలో 6,385 మంది విద్యార్థులు జాయినైనట్లు తెలిపారు. కళాశాలలో ప్రవేశానికి ఈ నెలాఖరు వరకు గడువు వుందని, ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్ విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఎంసెట్ శిక్షణ ఇస్తారని, కళాశాలలో పని చేస్తున్న సైన్స్ అధ్యాపకులకి కూడా శిక్షణ ఇస్తారని వివరించారు. కళాశాలలో ఖాళీగా వున్న పోస్టులలో అతిథి అధ్యాపకులతో ఫిల్ చేశామని, అన్ని జూనియర్ కళాశాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కష్టపడి విద్యార్థులను చదివించి, ఉత్తమ ఫలితాలు దుర్గారావు సాధించాలని సూచించారు.

### శ్రీదేవి పిక్చర్స్ సంస్థ నిర్వహణలో

## శ్రీముఖలింగేశ్వర క్షేత్ర మహాత్మ్యం

**- ఆలయ విశిష్టతపై చిత్రాన్ని నిర్మించటం ఆనందదాయం -**

**- అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




శ్రీముఖలింగేశ్వర ఆలయ విశిష్టతపై చిత్రాన్ని నిర్మించటం ఆనందదాయకమని, ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరైన నాయుడుగారి రాజశేఖర్ పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖ లింగేశ్వర ఆలయ విశిష్టతపై 'శ్రీముఖ లింగేశ్వర క్షేత్ర మహాత్మ్యం' అనే చలనచిత్రాన్ని రూపొందించనున్నారని, ఆలయ విశిష్టతను నిర్మాణ సంస్థకు అందించానని, ఇచ్చిన కథనం మేరకు శతచిత్రాల కన్నడ దర్శకుడు, సాయిప్రకాష్ చలనచిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ చలనచిత్రాన్ని 'శ్రీదేవి పిక్చర్స్' ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారని, ఈ మేరకు అంగీకార పత్రాన్ని శ్రీకాకుళం ఎన్జీవో హోంలో విడుదల చేసినట్లు తెలిపారు. దర్శకుడు సాయిప్రకాష్ గతంలో పలు హిట్ చిత్రాలు రూపొందించారని, సౌందర్య నటించిన తాంబూలాలు, మోహన్‌బాబు నటించిన ఖైదీగారు, అమ్మ నాగమ్మ, నాగదేవత వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారని తెలిపారు. ఆలయ విశిష్టత విశ్వవ్యాప్తంగా తెలిపేందుకు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, ఈ చలనచిత్ర ట్రైలర్ విజయదశమికి విడుదల చేస్తారని, షూటింగ్ నవంబర్ నెలలో నిర్వహించనున్నట్లు వివరించారు.
















# తొలిఅడుగు సూపర్‌సక్సెస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సూపర్‌సక్సెస్ అయిందని, వైకాపా విషపూరిత విమర్శలు, పస లేని కార్యక్రమాలకు ప్రజల అండదండలు లేవని, అందుకే వారి కార్యక్రమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ప్రజలు అఖండ నీరాజనాలు పడుతున్నారని అన్నారు. అయితే వైకాపా నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసూయతో కార్యక్రమాలు చేస్తున్నారని, వీటికి ప్రజల నుంచి అసలు స్పందనే లేదన్నారు. హామీలన్నీ నిలబెట్టుకున్నాం కాబట్టే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కొనియాడుతున్నారని, వైకాపాకు చెంపదెబ్బని అన్నారు.

## 'తొలి అడుగు' తడబడి.. 'మోసం' మొక్కుబడి



(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యత దక్కడంలేదన్న భావనలో తెలుగు తమ్ముళ్లు ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నారు. ఇక శ్రీకాకుళం, ఆమదాలవలస మున్సిపాలిటీల విషయానికి వచ్చేసరికి సుదీర్ఘ కాలంగా ఎన్నికలు లేకపోవడం, వార్డు ఇన్‌ఛార్జిలు ఎవరో తేలకపోవడం వల్ల తొలి అడుగుకు చాలా దూరంగా తెలుగు తమ్ముళ్లు ఉండిపోతున్నారు. దీనికి ముందు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినప్పుడు కొందరు నేతలు కష్టపడి సభ్యత్వం చేయిస్తే, దాన్ని వేరొకరు తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో ఇప్పుడు తొలిఅడుగు క్రెడిట్‌ను కూడా వేరేవారికి ఇవ్వడానికి ఇష్టంలేక కొందరు దన్నెట్టేశారు. ఎన్నికలు జరిగే ప్రతిసారీ టీడీపీ టిక్కెట్ ఆశించే కొర్ను నాగార్జున ప్రతాప్ సొంత వార్డులోనే ఇంతవరకు ఈ కార్యక్రమం ప్రారంభం కాలేదంటే ఎలా అర్థం చేసుకోవాలి? శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ గత మూడు రోజులుగా కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తొలి అడుగును శతశాతం పూర్తిచేయాలని ఘోషిస్తున్నారు. తొలి అడుగు వెనుకబాటులో ఉన్న వార్డులకు స్వయంగా ఎమ్మెల్యే వెళ్తున్నారు. బుధవారం నాటికి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉన్న లెక్కల ప్రకారం రాజాం, ఎచ్చెర్ల, చీపురుపల్లి, నెల్లిమర్ల, బొబ్బిలి, గజపతి నగరం, విజయనగరం వంటి నియోజకవర్గాలు ఈ కార్యక్రమంలో వెనుకబడి ఉన్నాయి. దీనికి కారణం కూడా తెలుగు తమ్ముళ్లు క్షేత్ర స్థాయిలో తిరగకపోవడమే.

# గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు నిరసన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామ, వార్డు సచివాలయం గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతూ బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 530 గ్రేడ్-3 ఏఎన్‌ఎంల్లో 150 మంది ఉద్యోగోన్నతికి అర్హులన్నారు. 2024 సెప్టెంబర్ 26న గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కి మారుస్తూ జీవో 179ను ప్రభుత్వం జారీ చేసిందని, దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 2న ప్రభుత్వం ఆదేశించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. శ్రీకాకుళంలో మాత్రమే ఇప్పటి వరకు జీవో 179 అమలు కాలేదన్నారు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం ఏవోకి వినతి పత్రం అందించారు. నిరసన కార్యాక్రమంలో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు టి. మోహినమ్మ, లలితకుమారి, చిన్నమ్మి, శోభారాణి, లక్ష్మీ, సౌభాగ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

తిమ్మాపురం గ్రామం ఎన్టీఆర్ కాలనీలో బుధవారం ఉదయం ఆమదాలవలస ఎస్సై కాంతారావు తమ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం ఎన్టీఆర్ కాలనీలో ఉన్న అన్ని టూవీలర్స్ రికార్డులను తనిఖీ చేసారు. ఇందులో భాగంగా 14 టూవీలర్స్‌కి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా 'బెండి'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బెండి నర్సింగరావు నియమితులైనట్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ జగదీష్, సనపల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో జరిగిన రాష్ట్రమహాసభలో ఎన్నికలు నిర్వహించారని, అనివార్య కారణాల వల్ల శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన కార్యవర్గ సభ్యుని పదవి ఖాళీగా ఉండిపోయిందని, జిల్లా కమిటీ సమావేశంలో దాన్ని భర్తీ చేయడానికి నర్సింగరావు పేరును సిఫార్సు చేసినట్టు వివరించారు. ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం ఈ సిఫార్సును ఆమోదించిందని తెలిపారు. టెక్కలికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నర్సింగరావు గతంలో యూనియన్ జిల్లా కార్యదర్శిగా కూడా పని చేశారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, నర్సింగరావు నియామకానికి హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలకృష్ణ, ఎం వాసు, రాష్ట్ర కౌన్సిలర్లు కొంచాడ రవికుమార్, జీ.శ్రీనివాస రావు, కుంచె చిన్నారావు, స్వామ్నా జిల్లా అధ్యక్షుడు సున్నం చిన్నారావు, గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్ నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకల రామారావులు కూడా హర్షం వ్యక్తం చేసారు

## సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలను

# జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, పాలకొండ)

పాలకొండలో గల స్థానిక ఎలైట్ కాలేజీ ఆవరణలో పాలకొండ మండల మహాసభ బెహర బంగారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు నెల్లి సూర్యనారాయణ మాట్లాడుతూ భారత సీపీఐ నిరంతరము కష్ట జీవుల తరఫున పోరాడుతుందన్నారు. ఆనాడు పాలకొండ ప్రాంతంలో గిరిజన పేదలకు భూ పంపిణీ చేయాలని జంపర్‌కోట, అమ్మ చెరువు గూడలు, బొమ్మిక తదితర ప్రాంతాలలో ఆనాటి ఫారెస్ట్ అధికారులను ఎదిరించి భూ పోరాటాలు జరిపి పేదలకు సుమారు 1400 ఎకరాలు భూమిని అప్పగించామన్నారు. ఇలాంటి పోరాటాలు చేయడం ద్వారా పేద ప్రజలుకు ఎర్రజెండాకు ఉన్న సంబంధాన్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. అలాంటి ఉద్యమాలు ద్వారానే అశేష ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. ఆనాడు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను నేడు పాలకులు తిరగదోడుతున్న నేపథ్యంలో అన్ని వర్గాలను కూడేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా సభ్యులు ఉత్తరావల్లి మురళీమోహనరావు మాట్లాడుతూ వచ్చేనెల 8, 9 తేదీల్లో జరిగే సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా ద్వితీయ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ద్వారపూడి అప్పలనాయుడు, బెహరా బంగారు, బుడితి భారతి, ఎల్లుమహంతి స్వామి శేఖర్, శ్రీనివాసరావు, ఆదినారాయణ విశ్వేశ్వరరావు, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పేదప్రజలకు అండగా "సీఎం సహాయ నిధి"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శిలగాం సింగువలస గ్రామానికి చెందిన ధర్మాన పద్మ కుటుంబానికి భరోసాగా సీఎం సహాయ నిధిని ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేసి మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమై, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు, పేదలకు సాయం అందించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు సీఎంఆర్ఎఫ్‌తో లబ్ధి పొందాయన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రాణాపాయంలో ఎవరున్నా సరే.. వైద్యచికిత్స అత్యవసరమని గుర్తించిన ప్రజా ప్రభుత్వం ఎల్వోసీల జారీని వేగవంతం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, పేద ప్రజలకు భరోసా అని, సీఎం సహాయనిధిని వైద్య నిమిత్తం ఖర్చు చెయ్యాలని, పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరమన్నారు. సీఎం సహాయ నిధిలో భాగముగా రూ.40వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## విస్మయ-2025 కార్యక్రమం ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో డేటాసైన్స్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో విస్మయ-2025 ఘనంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన విస్మయ-2025 బ్రోచరును ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్, విద్యార్థులు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ రంగలలో డేటాసైన్స్ చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. విద్యార్థులు ఆయా అవకాశాలను అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీవీజీ సుబ్రహ్మణ్యం, హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ డి.రవిశంకర్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.




## సుపరిపాలనకు చిరునామా"టీడీపీ"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుపరిపాలనకు చిరునామ తెలుగుదేశం పార్టీ అని, రాష్ట్రంలో, శ్రీకాకుళం జిల్లాలో అభివృద్ధి శకం మొదలైందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ బుధవారం అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ, రూరల్ మండలం, శిలగాం సింగువలస గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించి మాట్లాడుతూ సుపరిపాలన టీడీపీతోనే సాధ్యమని, కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ గ్రామాన్ని పర్యటించి గ్రామ ప్రజల సమస్యలను తీరుస్తామని, ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, సమస్యలపై ఆరాతీసారు. కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్య పడవద్దని, రానున్న కాలంలో అందరికీ మంచి జరుగుతుందన్నారు. ప్రజాసేవకే తాను రాజకీయంలోకి వచ్చానని, ప్రతీ కార్యకర్తకు, పార్టీతో సంబంధం లేకుండా ప్రజలందరి సమస్యలను తన భుజానవేసుకొని, పరిష్కారమయ్యేవిధంగా చూస్తానని, గ్రామ ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ముగ్ధుణ్ణయ్యానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష బృందం, ఇతర నాయకులు, ఇన్ఛార్జ్‌లు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# 4న హుండీ లెక్కింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపును వచ్చేనెల 4న నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేవెల్‌వీబీ ప్రసాద్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లెక్కింపు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్తలు, అర్చకులు, గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

# గురుకులాలపై దృష్టి పెట్టండి

(సత్యంన్యూస్, పాతపట్నం)

శ్రీకాకుళం జిల్లా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారిని పాతపట్నంలోని తన ఛాంబర్‌లో బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జెఏసి జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్ కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు కానుకుర్తి గోవింద్, మాలమహానాడు జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు పాండు రంగారావులు మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత విద్యార్థులు పట్ల వారి విద్యా పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నాయన్నారు. బోధన బోధనేతర సిబ్బంది నియామకాలు 2015 నుండి నియామకాలు జరపలేదని, గురుకులాల్లో కరెంట్ లేకపోతే ఉక్కతో దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని గురుకులాలకు సోలారా ద్వారా కరెంట్ సరఫరా చేయాలని కోరారు. పాతపట్నం గురుకులంలో చాలా సమస్యలు ఉన్నాయని, తక్షణమే గురుకులాలన్నీ సందర్శించాలని వారు కోరారు. ఈ విషయాలు పై సంబధిత అధికార్లకు ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటి పరిస్థితి ఏమి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మెరుగైన విద్య కోసం కృషి చేయాలని కోరారు.



# సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థి దశ చాలా కీలకమని, జెసి డాక్టర్ వినోద్ కుమార్ కుర్మాన బుధవారం తెలిపారు. జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు జెఎఫ్ఎం అనిల్ కుమార్ కూన ఆధ్వర్యంలో విద్యార్థి సాధికారత యువత, యూనివర్సల్ వాల్యూస్ అనే ప్రభావవంతమైన కార్యక్రమాన్ని పొన్నాడ గ్రామంలో కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించారు. శిక్షకులు జెసిఐ సెనెటర్ డాక్టర్ వినోద్ కుమార్ కుర్మాన ఉత్తేజకరమైన, ఆలోచింపచేసిన సెషన్‌ను అందించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థికీ నైతికవిలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలపై అవగాహన ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు జెఎఫ్ఎం అనిల్‌కుమార్ కూన మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించాలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు, వారే పునాది వేసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, ఆ కారణంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగటమే కాకుండా, చెడు ఆలోచనలకు బానిసవుతున్నారన్నారు. జెసిఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి. బీమ శంకర్ సూచనలతో ప్రతీ పాఠశాలలో, కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, విజయాలకు ఎలాచేరుకోవాలి, నిర్దేశించుకున్న గమ్యానికి ఎలా చేరుకోవాలనే అంశంపై, నిశానిర్దేశం చేసే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులలో చైతన్యం తీసుకువస్తామన్నారు. నైతిక బాధ్యతను కలిగించడం, శాంతిని ప్రోత్సహించడం, బలమైన సార్వత్రిక విలువలతో యువతను పెంపొందించడం ద్వారా మంచి సమాజాన్ని నిర్మించడం అవసరమని పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ సింగూరు, స్వాతి, మణిశర్మ, డా.కృష్ణమోహన్, ఇతరసభ్యులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# బదిలీ టీచర్లకు సన్మానం

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

మండలంలోని మేఘవరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బలివాడ రవి దుర్గారావు, నారాయణరావు మాస్టర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ ఉమారావు, మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్ రెడ్డి, పరమటి మంగవేణి, నౌపడ భీమారావు, విద్య కమిటీ కమిటీ చైర్మన్ దీర్ఘాసి జయరాం రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు గిన్ని మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు బలివాడ రవి దుర్గారావు మాస్టారు, డోల నారాయణరావు మాస్టారు చెరో రూ.5వేల చొప్పున పాఠశాల అభివృద్ధికి విరాళంగా ఇచ్చారు.



## అన్నదానసేవలో" చిన్నారి ప్రేమ్‌జిత్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదల ఆకలి తీర్చాలనే ఆలోచన గొప్పదని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, ప్రముఖ వైద్యులు మురళి బుధవారం పేర్కొన్నారు. కరజాడ గ్రామానికి చెందిన పొడుగు అవినాష్, సౌజన్యల కుమారుడు జన్మదినం సందర్భంగా అన్నవితరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు నైట్ షెల్టర్ నిర్వాహకులు, చేయుత మేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మిలతో అన్నవితరణ ప్రారంభించి మాట్లాడుతూ ప్రేమ్‌జిత్, సింగుపురం శ్యారదా పాఠశాలలో చదువుతూ, తల్లితండ్రుల కోరికమేరకు, తన జన్మదినాన్ని పేదల మధ్య జరుపుకున్నారని, ఇలాంటి వేడుకలలో, చిన్నారులు కేక్ కటింగ్ ఛాక్లెట్స్, బిస్కట్స్, స్నేహితులని ఆర్భాటానికి, సరదాకి అనుకుంటారని, అందుకు భిన్నంగా ఏ ఆర్భాటం లేకుండా, స్థానిక నైట్‌షెల్టర్‌లో, నిస్సహాయుల మధ్య జరుపుకొని అన్నవితరణ చేపట్టి అందరిలో స్ఫూర్తినింపారన్నారు. కార్యక్రమంలో నేటి దాతలు పొడుగు అవినాష్, సౌజన్య కుటుంబ సభ్యులు, చిరంజీవి ప్రేమ్ జిత్, పొడుగు చరణ్, నంది ఉమాశంకర్, ఉర్లం శివతేజ, షెల్టర్ నిస్సహాయుల బృందం పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.